క్లుప్తంగా

విధుల్లో మానసిక ఒత్తిడిని వీడాలి


మాట్లాడుతున్న జవ్వాది వెంకటేశ్వరబాబు

పాల్వంచ: పోలీసులు విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని వీడాలని మానసిక వైద్య నిపుణులు, కొత్తగూడెం రిటైర్డ్ ఆర్టీసీ మేనేజర్ జవ్వాడి వెంకటేశ్వరబాబు అన్నారు. సోమవారం స్థానిక కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి అవగాహన నిర్వహించగా వెంకటేశ్వరబాబు మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి ఒత్తిడికి లోను కావొద్దని, సమన్వయంతో పనిని విభజించుకుని సక్రమంగా పూర్తి చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. పనిభారం పెరిగిందని ఏకాగ్రత కోల్పోవద్దని, మానసిక దృఢత్వం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్, సబ్ డివిజన్ పరిధిలోని పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి, అశ్వారావుపేట ఎస్ఐలు సుమన్, రాజేశ్, రాజశేఖర్, రాఘవయ్య, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

వీఓఏల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందురూరల్: వీఓఏల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సెర్ప్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్‌నబీ మాట్లాడుతూ.. వీఓఏలకు పని ఒత్తిడి తగ్గించాలని, గ్రామ సంఘం నుంచి రూ.3 వేలు వేతనం ప్రభుత్వ జీఓ ప్రకారం ఇవ్వాలని కోరారు. ఇంకా పలు సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, సుల్తానా, వెంకటలక్ష్మి, వసంత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు రేడియం స్టిక్కర్లు అతికించాలి


రేడియం స్టిక్కర్లు అతికించిన సీఐ, ఎస్ఐ

జూలూరుపాడు: రైతులందరూ తమ పశువులకు రేడియంతో కూడిన పెయింట్ గానీ, స్టిక్కర్లు గానీ అతికించాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణాప్రతాప్ కోరారు. సోమవారం రాత్రి వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గేదెలు, ఆవులు, ఎద్దులు, దూడలకు రేడియం స్టిక్కర్లను అతికించి మాట్లాడారు. రాత్రి వేళలో పశువులు కన్పించకపోవడంతో వాటిని ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పశువులు కూడా చనిపోతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతులందరూ తమ పశువులకు తప్పని సరిగా రేడియం స్టిక్కర్లు లేదా పెయింట్ వేయాలని సూచించారు.

మంత్రి పొంగులేటికి వినతి


మంత్రికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలో సమస్యలను పరిష్కరించాలని న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం జిల్లా నారాయణపురంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. గోదావరి జలాలను రోళ్లపాడుకు మళ్లించి ఇల్లెందు మండలం మీదుగా ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. అలాగే, రూ.2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గుండాల మండలం రోళ్లగడ్డలో లింగన్న స్మారకస్తూపం నిర్మాణంపై విన్నవించారు.

జీరో వ్యాపారం మానుకోవాలి

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలో వ్యాపారులు జీరో వ్యాపారం మానుకోవాలని చైర్మన్ బానోతు రాంబాబు సూచించారు. చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, సొసైటీ కార్యదర్శి హీరాలాల్‌తో సమావేశమై త్వరలోనే వ్యాపారులతో సమావేశమవుతామని చెప్పారు. మార్కెట్ పరిధి మండలాల్లో సబ్ యార్డుల ద్వారా కొనుగోళ్లు చేపడుతామని, గ్రామాల్లో అనుమతి లేకుండా జీరో వ్యాపారం చేస్తే సహించేది లేదన్నారు. అలాగే, ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టులను బలోపేతం చేసి, కొత్త చెక్‌పోస్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయ్యేనా?

- వీవీపీలో విలీనం కోసం ప్రతిపాదనలు
- అదే జరిగితే జూలూరుపాడులో నిరుపేదలకు మెరుగైన వైద్యం
- అడుగులు ముందుకు పడకపోవడంతో ఇక్కట్లు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న స్థానికులు


జూలూరుపాడులోని 30 పడకల ఆస్పత్రి

జూలూరుపాడు: జూలూరుపాడులోని పీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రభుత్వం 22 ఏళ్ల కిందట నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనంలో 2012 నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) అనధికారికంగా కొనసాగుతోంది. ఆనాటి నుంచి సీహెచ్‌సీగా కొనసాగుతున్నప్పటికీ వైద్యవిధాన పరిషత్‌లో విలీనం కాకపోవడంతో అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు. సీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయితే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. సీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి పంపినప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు.

రెండేళ్లు దడిచినా..

జిల్లాలోని చర్ల, జూలూరుపాడు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్చాలనే ప్రతిపాదనలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2022 సంవత్సరంలో వైద్యవిధాన పరిషత్ జిల్లా ప్రధాన ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ రవిబాబు 30 పడకల ఆస్పత్రి భవనాన్ని సందర్శించి, సౌకర్యాలను పరిశీలించారు. వైద్య విధాన పరిషత్‌లోకి మార్చేందుకు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసి, రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఫైల్ ముందుకు సాగకపోవడంతో ఎలాంటి పురోగతి లేదు. 30 పడకల ఆస్పత్రి కోసమని లక్షల రూపాయలతో భవనాన్ని నిర్మించారు గానీ, సీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు నోచుకోకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ప్రజలకు నామమాత్ర వైద్యసేవలు అందుతున్నాయి.

ఖమ్మం లేదా కొత్తగూడెం..

ఏళ్ల తరబడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగానే కొనసాగుతుండటంతో సరైన వైద్యసేవలు అందకపోవడంతో మెరుగైన వైద్యసేవలకోసం రోగులు ఖమ్మం, కొత్తగూడెం తదితర పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సీహెచ్‌సీగా పేర్కొంటున్నా అందుకు తగిన వైద్యులు, వైద్య సిబ్బంది, యంత్ర పరికరాలు లేకపోవడంతో పీహెచ్‌సీ స్థాయిలోనే సేవలందుతున్నాయి. సీహెచ్‌సీ కింద వైద్యులు, వైద్యసిబ్బంది నియామక ప్రక్రియలో భాగంగా నలుగురు వైద్యులు, ఒకరు డెంటల్ డాక్టర్, ఒకరు హెడ్ నర్సు, ఆరుగురు స్టాఫ్ నర్సులను నియమించారు. వీరిలో పలువురు డిప్యూటేషన్‌పై వెళ్లగా ఒక డాక్టర్, హెడ్ నర్సు, నలుగురు స్టాఫ్ నర్సులు మాత్రమే ఉన్నారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయకపోవడంతో నిరుపేద గిరిజన ప్రజలకు మాత్రం మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగలగా.. అత్యవసర పరిస్థితులు ఎదురైతే కొత్తగూడెం, ఖమ్మం లేదా హైదరాబాద్, విజయవాడ వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుత ఉమ్మడి జిల్లా నుంచి ఉన్న డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులతోపాటు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌లు సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కోసం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ అయితే..

సీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం డెంటల్ డాక్టర్ ఉండటంతో స్త్రీ వైద్యనిపుణులు(గైకానలజిస్ట్), శస్త్ర చికిత్స (సర్జరీ) నిపుణులు, పిల్లల వైద్యనిపుణులు, ఆర్థోపెడిక్ నిపుణులు, అనస్తీషియా (మత్తు వైద్యులు), రేడియాలజిస్ట్, ఫార్మసిస్ట్, డార్క్ రూమ్ అసిస్టెంట్, ఏఎన్ఎంల నియామకాలు జరుగుతాయి. తద్వారా జూలూరుపాడుతో పాటు చండ్రుగొండ, సుజాతనగర్, ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

ఇప్పటికైనా అప్‌గ్రేడ్ చేయాలి



పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి. దశాబ్దాల కిందట 30 పడకల ఆస్పత్రి కోసం భవనాన్ని నిర్మించారు. ఈ విషయంలో మా పార్టీ తరఫున పలుమార్లు ఆందోళనలు చేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి.

–జి.వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి

దృష్టి సారించాలి



ఆస్పత్రి అప్‌గ్రేడ్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా విస్తరించడంతో పాటు వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించి పరికరాలను సమకూర్చాలి. ప్రస్తుతం పీహెచ్‌సీగా కొనసాగుతున్న సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించాలి.

–యాసా నరేశ్, సీపీఎం మండల కార్యదర్శి

ప్రతిపాదనలు పంపించాం



సీహెచ్‌సీ అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో వైద్య విధాన పరిషత్‌లో విలీనం అవుతుంది. అలాగే, ఇక్కడి పీహెచ్‌సీని పడమటనర్సాపురం లేదా మరోచోటకు తరలించే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న వారితోనే మెరుగైన సేవలదిస్తున్నాం.

–డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు జీఎం కార్యాలయంలో సోమవారం ఎస్‌ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూ నిర్వహించారు. అనంతరం మెడికల్ పరీక్షల కోసం పంపించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సూపరింటెండెంట్ రామకృష్ణ, అపర్ణ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్డాఫీస్ ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా సీహెచ్‌పీలలోని బెల్టుల వద్ద పనిచేస్తున్న బెల్ట్ క్లీనింగ్, సేల్ పికింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు పనికితగ్గ వేతనం చెల్లించాలని హెడ్డాఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏజీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

సెల్‌ఫోన్ రికవరీ


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ సురేశ్

టేకులపల్లి: నెల రోజుల కిందట పోయిన మొబైల్ ఫోన్‌ను టేకులపల్లి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి సోమవారం అప్పగించారు. ఎస్ఐ పి.సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని గోలియాతండా పంచాయతీ కాలనీతండాకు చెందిన జె.సుభాష్ నెల రోజుల కిందట టేకులపల్లిలో నిర్వహించే వారాంతపు సంతలో తన మొబైల్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సోమవారం బాధితుడికి ఫోన్‌ని ఎస్ఐ అందజేశారు.

ఆలయాల్లో 'కార్తీక' సందడి


కొత్తగూడెంటౌన్: గాజులరాజంబస్తీలో..


పాల్వంచరూరల్: శ్రీలలితకామేశ్వరి ఆలయంలో..


సుజాతనగర్: శివాలయంలో భక్తుల పూజలు


జూలూరుపాడు: పూజలు చేస్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్/సుజాతనగర్/జూలూరుపాడు: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, హోమాలు జరిపించారు. శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి (గణేశ్ టెంపుల్), బూడిదగడ్డబస్తీలోని శ్రీమహంకాళి, రామవరంలోని శ్రీసీతారామహనుమాళ్శి వాలయం, రుద్రంపూర్, హెడ్ఆఫీస్ ఏరియా, పాత కొత్తగూడెం, విద్యానగర్‌కాలనీ, శ్రీనగర్‌కాలనీలోని ఆలయాలతోపాటు శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీధర్మశాస్తా ఆలయంలో ఆలయ ప్రధాన కార్యదర్శి, గురుస్వామి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 50 మందికి పైగా అయ్యప్పమాల ధరించారు. కార్యక్రమంలో నవీన్, అరుణానందస్వామి, జక్కుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం, శ్రీలలితా కామేశ్వరి, శివాలయంలో భక్తులు వేకుజామున దీపాలు వెలిగించారు. కాగా, సుజాతనగర్ మండలంలోని శివాలయాలతోపాటు జూలూరుపాడు మండలంలోని గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు బారులుదీరారు. శివుడికి అభిషేకాలు నిర్వహించారు.

ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటలన్నింటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించగా వారు మాట్లాడారు. వరి, పత్తి పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముద్దా భిక్షం, బుర్రా వెంకన్న, కల్లూరి శేఖర్, బానోత్ ధర్మ, నూప భాస్కర్, ఎదల్లపల్లి ఆజాద్, ఏదులాపురం గోపాల్‌రావు, నిమ్మల రాంబాబు, దాసరి సాయి, శ్రీరామ్ కోటయ్య, నాగేశ్వరరావు, వీరబాబు, పంతులు, వీరబ్రహ్మచారి, జర్పుల సుందర్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి వేతనాలు చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి ప్రసంగించగా జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్, సహాయ కార్యదర్శి కె.సత్య, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎం.విజయశీల, కృష్ణవేణి, సూరమ్మ, భాను, సావిత్రి, లక్ష్మీదుర్గ, చంద్రకళ, రమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

అథ్లెటిక్స్‌లో 'ప్రియదర్శిని' ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 2, 3 తేదీల్లో ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తగూడెం ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చాటారు. పోటీల్లో రెండు బంగారు, ఒక రజత పతకాన్ని సాధించారని ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. మాలోత్ అఖిల్ 500 మీటర్ల, 1500 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో బంగారు పతకం సాధించగా, మాలోత్ ప్రేమ్‌కుమార్ 10 కిలోమీటర్ల పరుగు పందెంలో రజతం సాధించినట్లు డైరెక్టర్ చలపతిరావు, ప్రిన్సిపాల్ నయీంపాషా సోమవారం చెప్పారు.

ఏరియా జీఎంకు వినతి


జీఎం శాలేంరాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): యాక్టింగ్ ఆధారంగా ప్రమోషన్ ఇవ్వాలని పీవీకే–5 షాఫ్ట్ గని మేనేజర్.. ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజును కోరారు. సోమవారం సమస్యలపై వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. పీవీకే గనిలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ కార్మికులకు ఏడేళ్లు లేదా ఎనిమిదేళ్లకు ఎస్ఎల్పీ (సర్వీస్డ్ లింక్డ్ ప్రమోషన్) జనవరిలో రావాల్సి ఉందని, 11 నెలలుగా ఆ ప్రమోషన్లు నిలిచిపోయాయని, వాటిని వెంటనే ఇవ్వాలని కోరారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్ వద్ద బీజేపీ నాయకులు

జూలూరుపాడు: ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకం కింద జూలూరుపాడుకు చెందిన బీజేపీ కిసాన్ రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్‌కు టాటా త్రీ కిలో వాట్ సోలార్ ప్లాంట్ మంజూరైంది. రమేశ్ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సోమవారం బీజేపీ నేతలు గల్లా సత్యనారాయణ, తాండ్ర వినోదరావు ప్రారంభించి మాట్లాడారు. సోలార్ విద్యుత్ ఉపయోగించడం వల్ల కార్బన్ డయాక్సైడ్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి భూక్యా శ్యామ్‌రాథోడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్, నెల్లూరు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, సిరిపురపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య విమర్శించారు. సోమవారం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మంగళవారం చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బత్తుల సత్యనారాయణ, అబ్బులు, ఎస్‌డీ పాషా, ఆరెల్లి కృష్ణ, దేశి, చింటూ, గోవర్ధన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి..


నివాళులర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: నింగి, నేల ఉన్నన్ని రోజులు అమరుల త్యాగాలు నిలిచే ఉంటాయని, అమరుల త్యాగం మనకు స్ఫూర్తిదాయకమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బాణోతు ఊక్లానాయక్ అన్నారు. ఈ నెల 9 వరకు నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించి కాచనపల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బాణోత్ రాంసింగ్, ఉప్పరబోయిన రామ్మూర్తి, నెల్లూరి నాగేశ్వరరావు, పెనక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

అమరుల ఆశయ సాధనకు పోరాటం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకుడు జర్పుల సుందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కాచనపల్లి అమరవీరుల స్తూపం వద్ద జెండా ఎగురవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మపురి వీరబ్రహ్మాచారి, ఏనుటి నాగయ్య, బానోత్ లింగా, సీతారాములు, సుడిగాలి వెంకన్న, బానోతు జగ్యా, కాశీరాం, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని తొమ్మిదోమైలుతండాలో జరిగిన అమరవీరుల వర్ధంతి సభలో వారు మాట్లాడారు .పేద ప్రజల కోసం తమ జీవితాన్ని అంకితం చేసినవారి ఆశయ సాధనకు కృషిచేయాలనికోరారు. బీజేపీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ విధిస్తూ ప్రజా నాయకులపై, ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజా కంటక పాలన కొనసాగిస్తోందని తెలిపారు. జిల్లా నాయకులు భూక్యా హర్ష్య, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గుగులోతు రామచందర్ అన్నారు.

సమాజ మార్పు కోసం పోరాడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ఇల్లెందు: సమాజ మార్పు కోసం విద్యార్థులు, యువకులు సమరశీల పోరాటాలు నిర్వహించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందులో జంపాల చంద్రశేఖరప్రసాద్, నీలం రాంచంద్రయ్యను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐతా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సభలో మధు మాట్లాడారు. 1975 నవంబర్ 5న పీడీఎస్‌యూ నిర్మాతలు జంపాల చంద్రశేఖరప్రసాద్, నీలం రాంచంద్రయ్యను ఎన్‌కౌంటర్ చేశారని, 1972 ఏప్రిల్ 14న ఉస్మానియా క్యాంపస్‌లో జార్జిరెడ్డిని హత్య చేశారని తెలిపారు. విప్లవ విద్యార్థి ఉద్యమంలో అమరుల త్యాగాలు కీలకపాత్ర పోషించాయని తెలిపారు. సభలో జె.సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, బోనగిరి మధు, జి.మస్తాన్, మోకాళ్ల రమేశ్, కోలా లక్ష్మీనారాయణలు, ఇర్ప రాజేశ్, రాజేంద్రప్రసాద్, తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింటి సర్వే


ఇల్లెందు: మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందు/ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని, ప్రజలంతా తమ ఇంటి ముందుకు వచ్చే సర్వే అధికారులకు వివరాలు అందజేసి సహకరించాలని తహసీల్దార్ కె.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంఈఓ స్వామి కోరారు. సోమవారం ఇల్లెందు 24 ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాతఆ ఇంటికి స్టిక్కర్ అంటించాలని తెలిపారు. అలాగే, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ ధన్‌సింగ్ మాట్లాడారు. సర్వేపై అవగాహన కల్పించారు.

గోర్‌బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి


సేవాలాల్ సేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. జూలూరుపాడులో సేవాలాల్ సేన కార్యాలయాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. జీవో నంబర్ 3కు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. అలాగే, త్వరలోనే టేకులపల్లిలో మొదలై తొమ్మిది జిల్లాల్లో కొనసాగనున్న శ్రీసంత్ రగ్ జోల్ యాత్రను గిరిజనులు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరావత్ సురేశ్, ఎల్.వెంకటేశ్, మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు రవి రాథోడ్, భూక్యా శ్రీను, బానోత్ నాగరాజు, బాదావత్ సురేశ్, లాలునాయక్ పాల్గొన్నారు.